క్లుప్తంగా

పోరాట యోధుడు సుభాష్ చంద్రబోస్



సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జాతీయోద్యమ నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం శాంతినగర్‌లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ నివాసంలో ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి జియ్యాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటం చాలా గొప్పదని అన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆయన జయంతి రోజున పరాక్రమ దివస్‌గా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జియ్యాని విజయ్, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వరుడి విగ్రహ ప్రతిష్ట



కాశీవిశ్వేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు గుడివాడఅప్పన్నకాలనీలోని శ్రీ శ్రీ షిర్డీ సాయిబాబా జ్ఞాన మందిరంలో ఆలయ ధర్మకర్త మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో సోమవారం అన్నపూర్ణేశ్వరి సహిత కాశీ విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, 62, 63 వార్డుల కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, గల్లా చిన్నా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో 61వ వార్డు నాయకులు మజ్జి సోమేష్, నీలాపు జోగిబాబు, దొప్ప సన్యాసిరావు, చంద్రశేఖర్, గంగరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

విశాఖ లీగల్: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో మహిళా చట్టాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టం -1994పై ఆయన మాట్లాడారు. సమాజంలో ఆడ, మగ ఇద్దరు సమానమేనన్న విషయాన్ని కార్యకర్తలు ప్రచారం చేయాలన్నారు. వివాహితులు తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కౌన్సిలర్ అనిజా కుమారి, సీనియర్ న్యాయవాది సుధ, అంగన్‌వాడీ టీచర్లు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి స్వర్ణ పతకం



బిందు మౌనికకు బంగారు పతకం అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: యూనివర్సిటీ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన వైద్య విద్యార్థిని బి.బిందుమౌనికకు 2022 గానూ బంగారు పతకం లభించింది. గైనకాలజిస్టుగా, సూపరింటెండెంట్‌గా విశేష సేవలు అందించిన దివంగత ప్రొఫెసర్ కె.శారదాబాయి స్మారకంగా ప్రకటించిన ఈ గోల్డ్ మెడల్‌ను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మౌనికకు అందజేశారు. ప్రతి ఏటా అత్యుత్తమ మార్కులు సాధించిన అవుట్‌గోయింగ్ స్టూడెంట్‌కు పతకాన్ని అందించేందుకు కార్పస్‌ఫండ్‌గా రూ. 5 లక్షలను అందించిన ప్రొఫెసర్ మధుసూదన్ బాబును అభినందించారు.

రహదారులు అధ్వానం

- అభివృద్ధికి నోచుకోని తాటిపూడి పైప్‌లైన్ రోడ్డు
- నిధులు మంజూరైనా.. ప్రారంభం కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



గోపాలపట్నం శ్మశానవాటిక వెనుక రైల్వే స్థలంలో రహదారి దుస్థితి



అధ్వానంగా బుచ్చిరాజుపాలెం తాటిపూడి పైప్‌లైన్ రహదారి



పశువులకు ఆవాసంగా మారిన రోడ్డు

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం తాటిపూడి పైప్‌లైన్ రహదారి అభివృద్ధి ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్నట్టు ఉండిపోయింది. బీఆర్‌టీఎస్ రహదారికి ప్రత్యమ్నాయంగా మారిన ఈ రోడ్డు మరమ్మతులకు మోక్షమెప్పుడో అంటూ స్థానికులు ఎదురుచూస్తున్నారు. గతంలో ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు గ్రావెల్ రోడ్డు వేశారు. అనంతరం సుమారు రూ.38 లక్షలతో బీటీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. అయితే ఆ తర్వాత పనులు నిలిచిపోయాయి. ఇంతవరకు అవి ప్రారంభం కాలేదు. బీఆర్‌టీఎస్ రహదారిలో ట్రాఫిక్ రద్దీ పెరిగితే వాహన చోదకులు తాటిపూడి పైప్‌లైన్ రోడ్డునే ఆశ్రయిస్తున్నారు. ఈ రహదారిలో చాలా వరకు ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై పశువులు తిష్ట వేశాయి. వాహనాల పార్కింగ్‌కు ఈ దారినే వినియోగిస్తున్నారు. ఈ రహదారి పనులు జరిగి వాడకంలోకి వస్తే స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

రాళ్లు తేలి ఘోరంగా..

గోపాలపట్నం శ్మశానవాటిక వెనుక రోడ్డు రాళ్లు తేలి ఘోరంగా తయారైంది. దీనిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రోడ్డు చాలా మేరకు రైల్వే స్థలంలో ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో జీవీఎంసీ ఇక్కడ సీసీ రోడ్డు వేసేందుకు ప్రయత్నించగా.. సగంలోనే రైల్వే అధికారులు అడ్డుకుని పనులు నిలిపివేశారు. ఆ తురువాత ఈ రహదారిని పట్టించుకోలేదు. ఇటీవల జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఈ రోడ్డు అంశాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు ఈ ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. ఈ రోడ్డు అభివృద్ధి విషయమై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే చాలా ప్రయోజనం ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. ఈ రహదారి తాటిపూడి పైప్‌లైన్ దారికి అనుసంధానంగా ఉండి వాహన చోదకులు ట్రాఫిక్ కష్టాల నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.

రైల్వే అభివృద్ధికి ఉద్యోగుల కృషి



రైల్వే మజ్దూర్ యూనియన్ కొత్త కార్యవర్గం, సభ్యులతో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ డాక్టర్ వి.రవికిరణ్ ఆధ్వర్యంలో మర్రిపాలెం రైల్వే కాలనీలో వార్షిక జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి మాట్లాడుతూ ఈస్ట్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఉద్యోగులు, సభ్యులను ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రతి ఉద్యోగి నియమ, నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసి రైల్వేల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ బిస్వజిత్ పరీడా, జనరల్ సెక్రటరీ రంజన్‌కుమార్ దాస్‌లు మాట్లాడుతూ సమావేశాలను విజయవంతం చేసిన యూనియన్ సభ్యులు, డివిజనల్ సెక్రటరీలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మజ్దూర్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజనల్ సెక్రటరీగా మళ్లీ డాక్టర్ వి.రవికిరణ్ ఎన్నిక కాగా.. డివిజనల్ ప్రెసిడెంట్‌గా ఎల్.విజయ్‌కుమార్, ట్రెజరర్‌గా చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు. రవికిరణ్ మాట్లాడుతూ డివిజన్‌ను ప్రగతి పథంలో నడిపిస్తూ, రైల్వేల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతికి ధన్యవాదాలు తెలియజేశారు.

మోసగించిన బాలుడిపై ఫిర్యాదు

సీతమ్మధార: నమ్మించి మోసం చేసిన కేసులో తనకు న్యాయం చేయాలని ఓ బాలిక నాలుగో పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. శంకరమఠం ప్రాంతంలో నివసిస్తున్న ఓ బాలిక సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తన స్నేహితురాలి ద్వారా గోపాలపట్నం ప్రాంతానికి చెందిన ఓ బాలుడు పరిచయమయ్యాడు. కంచరపాలెం ఐటీఐలో ఆ బాలుడు చదువుతున్నాడు. వీరి మధ్య పరిచయం ప్రేమగా మారడంతో ఇద్దరూ హోటళ్లు, బీచ్‌ల వెంట తిరిగారు. పెళ్లి కోసం సదరు బాలుడు తన తల్లిదండ్రులను కూడా ఒప్పించాడు. ఈ క్రమంలో ఇద్దరూ శారీరకంగా దగ్గరయ్యారు. ఆ సమయంలో ఫొటోలు, వీడియోలు తీశాడు. ఇప్పుడు వాటితో సదరు బాలికను బంగారం, డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఆ బాలిక కొంత నగదు, బంగారం ముట్టజెప్పినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అయినప్పటికీ బాలుడి ఆగడాలు ఆగకపోవడంతోపాటు కుటుంబ సభ్యులపై దాడులు చేయాలని ఒత్తిడి చేయడంతో బాలిక పోలీసులను ఆశ్రయించింది.

నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

సింథియా: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్) ఆవరణలో విశాఖ పోర్ట్ అథారిటీ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సీడాప్ సౌజన్యంతో 18 నుంచి 27 ఏళ్ల వయసు కలిగి, పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, బీటెక్ కోర్సుల్లో మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్తీర్ణులైన వారికి వెల్డింగ్ టెక్నాలజీ, సీఎన్‌సీ మెషిన్ ఆపరేటర్, ప్రొడక్ట్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో 2 నెలల ఉచిత శిక్షణను అందించనున్నారు. ఆసక్తి గల వారు 9948183865, 7794840934. 0891-2704010 నెంబర్లలో ఈనెల 28వ తేదీలోపు సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు వృత్తి నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

మద్దిలపాలెం: విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేయడానికి వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు మహారాజ ప్రభుత్వ సంస్కృతిక కళాశాల అధ్యాపకుడు డాక్టర్.పి.అనిల్‌కుమార్ అన్నారు. మద్దిలపాలెంలో నోడల్ రిసోర్స్ సెంటర్ అయిన డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రారంభమైన రెండో దశ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 25వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు వృత్తి కోర్సుల్లో నైపుణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, నోడల్ రిసోర్స్ కో ఆర్డినేటర్ పి.వాణి, మాస్టర్ ట్రైనర్స్ రాజశేఖర్ సి.హెచ్.వి.సాయికృష్ణ, గీతాంజలి, శంకర్, పోలా ఉమామహేశ్వరరావు, 12 కళాశాలల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

పోర్ట్ పెన్షనర్ల సమస్యలపై చర్చ



డైరీని ఆవిష్కరిస్తున్న సనపల బంగారురాజు

మురళీనగర్: హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సభ్యులందరూ కలిసి రావాలని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు పిలుపునిచ్చారు. మాధవధారలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న నిర్వహించే సర్వసభ్య సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై కార్యవర్గ సభ్యుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డైరీని సంఘ చైర్మన్ సనపల బంగారురాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పి.శివప్రకాశరావు, కె.గణేష్, ఎ.నారాయణరావు, ఎం.ఎల్లయ్యరెడ్డి పాల్గొన్నారు.

'జయహో జనగణమన' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహిస్తున్న జయహో జనగణమన వారోత్సవాల పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జనగణమన గీతాలాపన ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి మాట్లాడుతూ విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమనను జాతీయ గీతంగా ఆమోదించి జనవరి 24కు 73 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు జిల్లాలో జనగణమన గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ముగింపు కార్యక్రమం ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా సెంట్రల్ పార్క్ వద్ద నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆచార్య కె.పల్లవి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు జనగణమన-రవీంద్రనాథ్ ఠాగూర్ అనే అంశంపై వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గొల్ల ప్రదీప్‌రాజ్, మహమ్మద్ ఇషాక్, నరేష్, కొయ్య రామకృష్ణ, సుధాకర్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 23 అర్జీలు

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 23 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

దాబాగార్డెన్స్: వాసవీమాత అగ్నిగుండంలో ఆత్మాహుతి చేసుకునే ఘట్టాన్ని స్మరిస్తూ 102మంది ముత్తయిదువలతో, 102 నమూనా అగ్నిగుండాలను ఏర్పాటు చేసి, 102 దీపాలతో వాసవీమాత ఆలయ ప్రాంగణంలో వాసవీ క్లబ్ సౌజన్యంతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి 102 రకాల ప్రసాదాలను నివేదించి, 102 పూలబుట్టలను సమర్పించారు. వన్‌టౌన్ ప్రాంతం కురుపాం మార్కెట్ సమీపాన గల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి దేవాలయం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణ మండపం, వాసవీ విజ్ఞాన మండలితో పాటు నగరంలోని వివిధ వాసవీ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపించారు. ధర్మరక్షణ కోసం 1013 సంవత్సరాల క్రితం వైశ్యజాతిని జాగృతపరిచి, 102మంది ఆర్యవైశ్య దంపతులను అగ్నిగుండంలోని నడిపించిన మాఘ శుద్ధ విదియ రోజు ఏటా ఆత్మార్పణ దినోత్సవంగా వైశ్యులు నిర్వహిస్తారని దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు తెలిపారు.

సమాచారమ్

అందుబాటులో జోన్-5 అధికారులు

సమస్యలు, సమాచారంపై ఫోన్ చేయండి



జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5లో ప్రజలకు సేవలందించడానికి అధికారులందరూ అందుబాటులో ఉన్నారు. జోనల్ కార్యాలయ పరిధిలో 40వ వార్డు నుంచి 63వ వార్డు వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. జోన్ పరిధికి సంబంధించి సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం అధికారులు పౌరులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తారు. జోన్ పరిధిలో సమస్యలు, సందేహాలపై కింద పేర్కొన్న అధికారుల నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. జోన్-5కు సంబంధించిన సమాచారం అడిగి తెలుసుకోవచ్చు.

జీవీఎంసీ జోన్-5 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్	97050 86888
	(ప్రథమ అప్పిలేట్ అధికారి)	
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్-1	99481 25699
	పీఐవో(రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్-2	99897 84585
	పీఐవో(టౌన్‌ప్లానింగ్, పబ్లిక్‌హెల్త్, యూసీడీ)	
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీమ్డ్ పీఐవో)	99480 78507
డాక్టర్ ఎ.రాజేష్	అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (పబ్లిక్‌హెల్త్)	99480 95520
ఐ.వి.రమణమూర్తి	అసిస్టెంట్ సిటీ ప్లానర్ (డీమ్డ్ పిఐవో)	81878 99199
ఆర్.బాబూరావు	అసిస్టెంట్ కమీషనర్-5	83747 83932.
	(రెవెన్యూ) డీమ్డ్ పీఐవో	
కె.పద్మావతి	సీడీవో, ఏపీడీ ఇన్‌చార్జి	89190 80201
	(యూసీడీ) డీమ్డ్ పీఐవో	

వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీకి చెందిన జెర్రిపోతుల అప్పలనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అతనికి వైఎస్సార్ బీమా వర్తించడంతో కుటుంబ సభ్యులకు సోమవారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. మిగిలిన రూ. 90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతాయన్నారు. అప్పలనాయుడు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని, త్వరలోనే పార్టీ తరపున కూడా తగిన సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ రాజాబాబు, నాయకులు వరపల మహేష్, అన్నెపు సూర్యనారాయణ, శరగడం హరీష్, సాడి కామేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో విద్యావేత్త రమణమూర్తి, హెచ్ఎం శ్రీనివాసులు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో నిర్వాహకులు

కంచరపాలెం: విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో చేపట్టిన మంత్రాస్‌లో భాగంగా సోమవారం 'పరీక్ష-పే-చర్చ' అనే అంశంపై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. 104 ఏరియా ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రీయ విద్యాలయం-2లో ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. కేంద్రీయ, ప్రభుత్వ, జెడ్పీ, జీవీఎంసీ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు ముఖ్య అతిథి విద్యావేత్త కె.వి.రమణమూర్తి బహుమతులు ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా ఏయూ ఫైన్ ఆర్ట్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె.వి.రవి, కొడాలి రవి వ్యవహరించారు. కేవీ-2 ఆర్ట్ టీచర్ పి.వినోద్‌కుమార్ పర్యవేక్షించారు.

నౌసేనాబాగ్ కేంద్రీయ విద్యాలయంలో..

సింథియా: కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మల్కాపురంలోని నౌసేనాబాగ్ కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 46 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.కె.దాస్, ఆర్ట్ టీచర్ సునేంద్రరావు పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో ఆంధ్రా యూనివర్సిటీ ఫైనార్ట్స్ నుంచి వచ్చిన ముగ్గురు పెయింటింగ్‌లను తిలకించి అత్యుత్తమైన 5 చిత్రాలను బహుమతులకు ఎంపిక చేశారు. మొదటి బహుమతికి వి.జై.వరుదన్, రెండో బహుమతికి పుష్పికాసమంత, మూడో బహుమతికి ప్రియాంకాబాయి, నాలుగో బహుమతికి హేమశ్రీ, ఐదో బహుమతికి ఎస్.సుమిత ఎంపికయ్యారు.

నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగండి

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఫార్మసీ కళాశాల విద్యార్థుల స్వాగత సభ



మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విశ్వవిద్యాలయంలో చేరిన తొలిరోజు నుంచి భవిష్యత్తులో సాధించాల్సిన నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచించారు. సోమవారం ఉదయం ఏయూ ఫార్మసీ కళాశాల విద్యార్థుల స్వాగత సభలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉండాలని, తద్వారా జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవడం సాధ్యపడుతుందన్నారు. విభిన్న రంగాలలో విజేతలుగా నిలిచిన వారి విజయ గాథలను చదవాలని సూచించారు. విజయం సాధించడంలో వారి ప్రయాణం, ఎదురైన సంఘటనలు వంటివి తెలుసుకోవాలన్నారు. ఆన్‌లైన్ కోర్సులు చేయడానికి ఆసక్తి చూపాలని చెప్పారు. ప్రతి విద్యార్థి తన సామర్థ్యాలను ముందుగా తెలుసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. ఏయూ ఫార్మసీ కళాశాల ఎందరో దిగ్గజాలను తీర్చిదిద్ది సమాజానికి అందించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఈశ్వర్ కుమార్, గిరిజా శాస్త్రి, గిరిజా శంకర్, మురళీకృష్ణ, శైలజ, అరుణ్ సంతోష్ పాల్గొన్నారు.

లలితా పీఠంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సుదర్శన యాగానికి అంకురార్పణ చేస్తున్న వేద పండితుడు రమేష్‌శర్మ

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో 74వ బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కుర్తాళం, లలిత పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో పీఠం ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్‌శర్మ నేతృత్వంలో విశేష పూజా కార్యక్రమాలను మొదలుపెట్టారు. సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 87వ జన్మదినోత్సవం సందర్భంగా లోక కల్యాణార్థం నవగ్రహ సహిత అష్టముఖ గండభేరుండ జ్వాలానారసింహ సుదర్శన మహా యాగం, భాగవత సప్తాహ ప్రవచన యజ్ఞం, కాళీ కాలభైరవుల ప్రతిష్ట వంటి విశేష పూజలు ఫిబ్రవరి 5వ తేదీ వరకు జరుగుతాయి. దీనిలో భాగంగా సుదర్శన మహాయాగానికి అంకురార్పణ చేస్తూ ప్రారంభ సన్నాహక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, మాతృకా పూజ, అంకురారోహణ, రక్షాబంధన, రుత్విగ్వరణం, అగ్ని మధనం, అఖండ దీపారాధన, పంచగవ్యప్రాశన, యాగ మండపారాధనలు, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం నిర్వహించారు.